క్లుప్తంగా

అగస్త్యేశ్వర స్వామి కల్యాణోత్సవం



వడలిలో అగస్త్యేశ్వర స్వామి కల్యాణం

పెనుగొండ: వడలిలో అగస్త్యేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం కనులపండువగా నిర్వహించారు. సోమవారం ఉదయం నుంచి అగస్త్యేశ్వర స్వామికి ఏకాదశ రుద్రాభిషేకం, అర్చనలు చేశారు. ఉమా పార్వతీ మాతకు కుంకుమార్చనలు నిర్వహించారు. రాత్రి ఎనిమిది గంటలకు అభిరామ్ దంపతులచే కల్యాణం వేద మంత్రోచ్చారణలతో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ నెల 28 వరకు ఉత్సవాలు నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కాలనీల్లో తాగునీటి కోసం ధర్నా



ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న నాయకులు

నరసాపురం: సీతారామపురం, మర్రితిప్ప గ్రామాల్లో ప్రభుత్వ కాలనీల్లోని ప్రజలకు తాగునీరు అందించాలని సీపీఎం కార్యదర్శి వర్గ సభ్యుడు కవురు పెద్దిరాజు డిమాండ్ చేశారు. తాగునీటి అవసరాలు తీర్చాలని కోరుతూ సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా పెద్దిరాజు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కాలనీల్లో తాగునీటి సౌకర్యం లేకపోవడం దారుణమన్నారు. సీతారామపురం నార్త గ్రామంలో మంచినీటి పైప్‌లైన్స్ కూడా వేయలేదని తెలిపారు. మర్రితిప్ప గ్రామంలో కూడా ఇదే పరిస్థితి ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు బూడిద జోగేశ్వరరావు, కోడి లక్ష్మణరావు, గుబ్బల పెద్దిరాజు, గుబ్బల వెంకటేశ్వరరావు, గుబ్బల నాగలక్ష్మి పాల్గొన్నారు.


ఆర్థిక ప్రమాణాల పెంపే లక్ష్యం



పోస్టర్ చూపుతున్న సర్పంచ్ శ్యామల సోనీ శాస్త్రి

పెనుగొండ: ప్రతి కుటుంబ ఆర్థిక ప్రమాణాలు పెంచడానికే పీ–4 సర్వే చేస్తున్నట్టు పెనుగొండ సర్పంచ్ నక్కా శ్యామల సోనీ శాస్త్రి తెలిపారు. సోమవారం పెనుగొండ పంచాయతీలో స్వర్ణాంధ్ర విజన్ 2047లో భాగంగా పీ–4 సర్వేపై నిర్వహించిన గ్రామ సభలో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా పేదరికంలో దిగువన ఉన్నటువంటి 20 శాతం కుటుంబాలను వెతికి వారి స్థితి గతులను మార్చడానికి ప్రభుత్వం కంకణం కట్టుకొందని వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి టి.రత్నాకర రావు, పంచాయతీ సభ్యులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం పరిశీలన



పాఠశాలలో స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం సభ్యులు

పోడూరు: పాలకొల్లులోని జీవీఎస్‌వీఆర్‌ఎం మున్సిపల్ ప్రాథమిక పాఠశాలను సోమవారం స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం సభ్యులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల పరిశుభ్రత, పాఠశాల ఆవరణలో పచ్చదనం, పరిశుభ్రత, ఇంకుడు గుంట, తాగునీరు, మరుగుదొడ్డి, మంచినీటి ట్యాంకు, వంటగది, తడి, పొడి చెత్తలను పరిశీలించారు. తడి చెత్తను కంపోస్ట్ ఎరువుగా తయారు చేసి మొక్కలకు వేయాలని హెచ్‌ఎం ఆర్ భవానీప్రసాద్‌కు, ఉపాధ్యాయులకు బృంద సభ్యులు సూచించారు. ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీ చిరంజీవి, మురళీకృష్ణ, స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం సభ్యులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ధర్నా

భీమవరం: కూటమి ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నల్లి రాజేష్ డిమాండ్ చేశారు. సోమవారం భీమవరం అంబేద్కర్ సెంటర్‌లో దళిత జేఏసీ, మాల మహానాడు ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా ప్రభుత్వం కేబినెట్‌లో తీసుకున్న నిర్ణయాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై ఏకపక్షంగా కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, మాలలపై కక్ష కట్టిందని ఆరోపించారు.

యథేచ్ఛగా ప్లాస్టిక్ కవర్ల వినియోగం

ప్రజల్లో కొరవడిన అవగాహన

నరసాపురంరూరల్: వారపు సంతల నుంచి బస్టాండ్‌ల వరకు ఎవరి వద్ద చూసినా ప్లాస్టిక్ కవర్లే దర్శనమిస్తున్నాయి. ప్లాస్టిక్ కవర్లపై ఉన్న నిషేధం కాగితాలకే పరిమితమవుతోంది. పర్యావరణానికి తీవ్ర ముప్పు కలిగిస్తున్న ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని శాస్త్రవేత్తలు చెబుతున్నా ప్రజల్లో అవగాహన కరువైంది. అధికారులు క్షేత్రస్థాయిలో ప్రజలకు ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే దుష్ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తే పరిస్థితి కొంత అదుపులో ఉండొచ్చని పలువురు చెబుతున్నారు. కాగితాలు అయితే కొద్ది రోజులకు, వస్త్రాలయితే కొన్ని నెలల్లోనే మట్టిలో కలిసిపోతాయి. ప్లాస్టిక్ కవర్లు ఏళ్లు గడిచినా కరగవు. ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధిస్తున్నామని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినా క్షేత్రస్థాయిలో సక్రమంగా అమలు కావడంలేదు. 2012లోనే ప్లాస్టిక్ వాడకం నిషేధించినా ప్రస్తుతం అవి ఆక్రమించే స్థలం సాధారణ చెత్త కంటే అధికంగా ఉంటుంది. దుకాణాలకు వెళ్లి ప్లాస్టిక్ కవర్లలో సరుకులు తీసుకుని, అనంతరం వాటిని ఎక్కడ బడితే అక్కడ పారవేస్తున్నారు. ముఖ్యంగా మురికి నీటి కాలువల్లో ఎటు చూసినా ప్లాస్టిక్ కవర్లే దర్శనమిస్తున్నాయి. ప్లాస్టిక్ వాడకాలను తగ్గించడానికి ప్రభుత్వం ప్రత్యేక చట్టం తీసుకువచ్చినా ఫలితం లేకపోయింది. ప్లాస్టిక్ కవర్లకు బదులు పేపర్ బ్యాగులు వాడుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించాలని పలువురు కోరుతున్నారు.



రుస్తుంబాద సచివాలయం సమీపంలో ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలు

ప్రభుత్వం విఫలం



ప్లాస్టిక్ కవర్లు నియంత్రించడంలో ప్రభుత్వం విఫలమైంది. ఒక్కోసారి గ్రామాల్లో సైతం ఇంటింటికీ ప్రచారం చేస్తున్నారు. పలువురు కళాశాల విద్యార్థులు ఎన్ఎస్ఎస్ శిబిరాలు నిర్వహించి, అనంతరం ర్యాలీలు నిర్వహిస్తున్నారు. పంచాయతీ వారు టాంటాం వేయడం, అన్నీ జరుగుతున్నాయి. అయితే నిషేధం అమలు మచ్చుకైనా కనిపించడం లేదు.

– వంగలపూడి రవి, లిఖితపూడి.

పర్యావరణానికి ముప్పు



ప్లాస్టిక్ కవర్లు పర్యావరణానికి ముప్పు అని మేధావులు, అధికారులు పదే పదే చెబుతున్నారు. అయితే వ్యాపారులు, వినియోగదారులు ప్లాస్టిక్ కవర్లనే వినియోగించడం పరిపాటిగా మారింది. వాతావరణంలో మార్పులు చోటు చేసుకోవడం, సమతుల్యత లోపించడం వంటి వాటికి కవర్ల వినియోగం ప్రధాన కారణం. పర్యావరణానికి ముప్పు కలిగించే కవర్ల నిషేధంపై శ్రద్ధ చూపాలి.

– కదలి మంగతాయారు, సారవ

ప్రేమ పేరుతో మోసం

భీమవరం: ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసి, ఇప్పుడు ముఖం చాటేస్తున్నాడంటూ భీమవరం పట్టణానికి చెందిన ఓ యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇందుకు సంబంధించి ఫిర్యాదుదారు తెలిపిన వివరాలను సీఐ ఎం.నాగరాజు తెలిపారు. బాధితురాలు పాఠశాలలో మూడో తరగతి చదువుతున్నప్పటి నుంచి జి.ఉదయ్ వెంటపడేవాడని, ఇంజినీరింగ్ పూర్తి చేశాక ఉద్యోగం వచ్చిన వెంటనే పెళ్లి చేసుకుంటానని చెప్పాడన్నారు. సచివాలయం, పంచాయతీల్లో పని చేశాడని. బాధిత యువతి పుట్టిన రోజున పట్టణంలోని ఓ హోటల్‌కు తీసుకెళ్లి బలవంతం చేశాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే తనను పెళ్లి చేసుకునేందుకు అతడి తల్లి నిరాకరించడంతో ఈ విషయమై పెద్దల సమక్షంలో మాట్లాడినా పట్టించుకోలేదని ప్రేమ పేరుతో మోసగించిన ఉదయ్‌పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసిందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ప్రజా సమస్యలు పట్టించుకోని పాలకులు

వైఎస్సార్ సీపీ మహిళా కార్యదర్శి జయసరిత

పోడూరు: ప్రజలు కష్టాల్లో ఉంటే సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, టీడీపీ ఎమ్మెల్యేలు చీప్ కామెడీలు చేస్తూ సేదదీరుతున్నారని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్రా జయసరిత విమర్శించారు. పార్టీ పాలకొల్లు కార్యాలయంలో సోమవారం ఆమె విలేకర్లతో మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలను కూటమి ప్రభుత్వం తుంగలోకి తొక్కిందన్నారు. రెండు లక్షల ఉద్యోగాలిస్తానని అసెంబ్లీ సాక్షిగా చెప్పిన చంద్రబాబు ఎన్ని ప్రభుత్వ ఉద్యోగాలిచ్చారని?, ఎన్ని ప్రైవేటు ఉద్యోగాలిచ్చారనీ?, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఎప్పుడిస్తారని? ప్రశ్నించారు. టీడీపీ నేతలు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ద్వేషంతో చౌకబారు విమర్శలు చేయడం తగదన్నారు. వాటిని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కూటమి నేతల విమర్శలు విన్న ప్రజలు ‘ఇదేం ఖర్మ రా బాబు’ అంటూ తలలు పట్టుకుంటున్నారని జయసరిత ఎద్దేవా చేశారు. సమావేశంలో పార్టీ నాయకులు జోగి వెంకటేశ్వరరావు, జోగాడ ఉమామహేశ్వరరావు, పెచ్చేటి కృష్ణాజీ, మామిడిశెట్టి చినబాబు, రామానుజుల చినమమధు, గొర్రెల రాంబాబు, జక్కంశెట్టి వెంకటరెడ్డి, వీరా మల్లికార్జునుడు, పెచ్చెట్టి నాగేంద్ర వరప్రసాద్, గంగిరెడ్ల ప్రసాద్, హైమావతి, కుమారి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి జయసరిత

క్షయ పట్ల అప్రమత్తంగా ఉండాలి

పోడూరు: క్షయ పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని లంకలకోడేరు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ ఎ.ప్రతాప్‌కుమార్ సూచించారు. క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం లంకలకోడేరు, చింతపర్రు గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. సచివాలయాల వద్ద ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతాప్‌కుమార్ మాట్లాడుతూ క్షయ పట్ల ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. రెండు వారాల మించి దగ్గు, దగ్గుతో పాటు తెమడ పడడం, తెమడలో రక్తం పడడం, జ్వరం, ఛాతీలో నొప్పి, ఆకలి మందగించడం, అలసట, నీరసం, రాత్రిపూట చెమటలు పట్టడం, బరువుతగ్గడం వంటివి క్షయ లక్షణాలని తెలిపారు. క్షయ ఉంటే వెంటనే గ్రామంలోని ఏఎన్ఎంను లేదా ఆశ కార్యకర్తను సంప్రదించి తెమడ పరీక్ష చేయించుకోవాలని సూచించారు. ఏరియా ఆసుపత్రికి వెళ్లి చెస్ట్ ఎక్స్‌రే తీయించుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎం నవ్యజీవన్, సర్పంచ్ గుమ్మాపు పెద్దిరాజు, ఉపసర్పంచ్ కృష్ణంరాజు, ఆరోగ్య విస్తరణ అధికారి గుడాల హరిబాబు, పీహెచ్ఎస్ పి.ఎలిజబెత్, కార్యదర్శి శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



లంకలకోడేరులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

డంపింగ్ యార్డు పొగతో ఇక్కట్లు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక యడ్లబజారు సెంటర్‌లో ఉన్న డంపింగ్ యార్డు నుంచి వస్తోన్న పొగతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. డంపింగ్ యార్డులో అంటుకున్న మంటలతో గత రెండు రోజులుగా యడ్లబజారు సెంటర్‌ను పొగ కమ్మేస్తోంది. దీనిపై స్థానికులు మునిసిపల్ అధికారులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. వేసవి కాలం వేడికి చెత్తలో ఉండే ప్లాస్టిక్ వ్యర్థాలు, మెడికల్ వంటి విషపూరితమైన రసాయనాలు అంటుకుని లేదా ఎవరైనా ఆకతాయిలు అంటించి ఉన్నా ఇలా పొగ వచ్చే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలు అంటుకుంటే అంత త్వరగా నిప్పు ఆరదని, ఎక్కువ మోతాదులో డంపింగ్‌యార్డ్‌ను తడపాల్సి ఉంటుందని తెలిపారు. పొగను అదుపులోకి తీసుకురాకపోతే ఊపిరితిత్తుల సంబంధిత దిందిన వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంటుందని భయాందోళనల చెందుతున్నారు.



డంపింగ్‌యార్డు నుంచి వస్తున్న పొగ

12 గ్యాస్ సిలిండర్ల స్వాధీనం

ఉండి: సెంటర్‌లోని హోటల్స్‌లో అక్రమంగా వినియోగిస్తున్న 12 గ్యాస్ సిలిండర్లను సివిల్ సప్లయి అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం హోటల్స్, దుకాణాలపై దాడులు నిర్వహించామని డిప్యూటీ తహసీల్దార్ మోరంపూడి మహేష్‌కుమార్ తెలిపారు. ఉండి సెంటర్‌లోని నెల్లూరు హోటల్ వద్ద నుంచి వ్యాపార అవసరాలకు వినియోగిస్తున్న 8 గృహ గ్యాస్ సిలిండర్లు, సమోసా తయారీ దుకాణం నుంచి ఒకటి, హరిప్రియ స్వీట్‌షాపు నుంచి 3 చొప్పున గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరిపై 6ఏ కేసు నమోదు చేశామని చెప్పారు.

ఘనంగా అమ్మవార్ల ఆలయ వార్షికోత్సవం



నెగ్గుపూడి ఆలయం వద్ద వామ పూజలు



వనువులమ్మ



కనకదుర్గమ్మ

పెనుమంట్ర: పెనుమంట్ర మండలం నెగపూడి గ్రామంలో పెనుగొండ – మార్టేరు రహదారిలోని నరసాపురం కాల్వగట్టున ఉన్న వనువులమ్మ, కనకదుర్గమ్మ ఆలయ ఆరో వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవార్లకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం గ్రామానికి చెందిన పాలసత్తి రామిరెడ్డి (రాజా) చంద్రిక దం పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ఆలయ ఆవరణలో భారీ అన్నసమారాధన ఏర్పాటచేశారు. ఆలయంలో సాయంత్రం లలిత సహస్ర నామ పారాయణం, అమ్మవార్లకు ఏక హారతి, పంచ హారతి, నక్షత్ర హారతులు నిర్వహించారు. పాల్గొని తీర్థ ప్రసాదాల స్వీకరించారు.

మంటలో పడిన ఆబోతుకు వైద్యం

పాలకొల్లు సెంట్రల్: పట్టణ పరిసర ప్రాంతంలో ఉన్న రామయ్యహాలు డంపింగ్ యార్డు వద్ద నాలుగు రోజులు క్రితం రెండు ఆబోతులు కొట్టుకున్నాయి. ఇందులో బలమైన ఆబోతు మరో ఆబోతును గెంటుకుంటూ డంపింగ్ యార్డు మంటల్లోకి గెంటేసింది. ఆబోతుకు తోక వద్ద తీవ్రంగా కాలిపోయింది. గాయంతో బాధపడుతున్న ఆబోతుకు యాళ్లవానిగరువు వై జంక్షన్ ప్రాంతంలో మహిళలు మేత పెడుతూ గాయమైన ప్రదేశంలో ఈగలు వాలకుండా సపర్యలు చేస్తున్నారు. దీనిని గమనించిన కాపిశెట్టి సోంబాబు, మల్లుల రవి అనే వ్యక్తులు సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. సోమవారం యానిమల్ సేవ్ డిపార్ట్‌మెంట్ నెస్ట్ ఆర్గనైజేషన్ సంస్థ సభ్యుడు మనీష్ గౌడ్ పోస్ట్ చేసిన వ్యక్తుల్లో ఒకరికి ఫోన్ చేసి ఆబోతు ఎక్కడ ఉందో సమాచారం తెలుసుకున్నారు. అక్కడ వెటర్నరీ వైద్య సిబ్బందిని తీసుకెళ్లి ఆ ఆబోతుకు వైద్యం చేశారు. అంతరం స్ప్రే బాటిల్, మెడిసిన్ అక్కడి స్థానికులకు అందజేశారు. ఏదైన అవసరమైతే తాము వచ్చి వైద్యం చేస్తామని మనీష్, వెటర్నరీ సిబ్బంది స్థానికులకు తమ ఫోన్ నెంబర్లు ఇచ్చి వెళ్లినట్లు చెబుతున్నారు.



ఆబోతుకి వైద్యం చేస్తున్న వెటర్నరీ సిబ్బంది

పీజీఆర్ఎస్‌కు 12 అర్జీలు

ఆకివీడు: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు సోమవారం 12 అర్జీలు అందినట్లు ఎంపీడీఓ సుహాసిని చెప్పారు. పట్టణంలోని నాన్ లేఅవుట్లు ఎన్ని ఉన్నాయి, ఎంతమంది ఫీజులు చెల్లించారు? ఎన్ఓసీలు ఎంత మందికి ఇచ్చారు. స్టాంప్‌లు, రిజిస్ట్రేషన్‌లో 486/1లో ఎకరం ఉంటే 2 ఎకరాల 79 సెంట్లు రిజిస్ట్రేషన్ ఎలా అయింది? హౌసింగ్ కాలనీలో ఎంత మందికి ఇళ్లు ఇచ్చారు? ఎంత మంది నిర్మించారనే సమాచారం ఇవ్వాలని మోరా రామిరెడ్డి అర్జీ ఇచ్చాడన్నారు. అజ్జమూరులో టర్నింగ్ వద్ద ప్రభుత్వ భూమి ఆక్రమించి నిర్మాణం చేయడం వల్ల ఆ ప్రాంతంలో ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామానికి చెందిన వర్థినేని వీర వెంకట సత్య శ్రీరామ చంద్రమూర్తి అర్జీ చేశాడన్నారు. అజ్జమూరు గరువు సమీపంలో వీధి దీపాలు వెలగడంలేదని గతంలో ఫిర్యాదు చేశామని, నాసిరకం దీపాలు వేయడం వల్ల త్వరగా పాడైపోయాయని ఫిర్యాదు చేశారన్నారు. తన భార్య వర్థినేని శేషకల్యాణి పేరున ఉన్న హెచ్‌పీ గ్యాస్ సిలెండర్‌ను ఉచిత పథకంలో ఎమ్మార్కే ఏజెన్సీలో తీసుకున్నామని, నేటికీ ఉచిత సొమ్ము పడలేదని ఫిర్యాదు చేశారని ఎంపీడీఓ తెలిపారు. అయిభీమవరం గ్రామానికి చెందిన కనుమూరు వెంకట రాణి తన భూమిని సర్వే చేయించాలని ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. మార్చి 24న స్పందన కార్యక్రమంలో ఇచ్చిన ఫిర్యాదుకు సమస్య పరిష్కారం కాలేదని, సరిహద్దుదారుడు తప్పుడు సమాచారం ఇచ్చి, మిమ్మల్ని మోసం చేశారని, దీనిపై విచారణ చేసి పోలీసు కేసు పెట్టాలని కనుమూరు వెంకట్రాజు ఫిర్యాదు చేశారన్నారు.

సామర్థ్యం పెంపుతో విద్యుత్ సమస్యలకు చెక్

- విద్యుత్ సబ్ స్టేషన్ల కెపాసిటీ పెంచాలి
- పెరుగుతున్న లోడు–వేసవిలో మరింత గోడు

ఆకివీడు: విద్యుత్ వినియోగం రోజు రోజుకూ పెరగడంతో పాటు, వేసవిలో మరింత అదనపు లోడుతో ప్రస్తుత సబ్‌స్టేషన్ల సామర్థ్యం సరిపోయే పరిస్థితి కన్పించడం లేదు. పలు సబ్ స్టేషన్లలో 5 ఎంవీఏలు, 8 ఎంవీఏల సామర్థ్యంతో ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. వీటి సామర్థ్యాన్ని మరింతగా పెంచడం వలన నాణ్యమైన విద్యుత్ సరఫరా అవుతుంది. ఉండి నియోజకవర్గంలో ఇటీవల రొయ్యల చెరువుల వినియోగం, ఐస్ ఫ్యాక్టరీలు, ఇతర పరిశ్రమల వినియోగం అధికమైంది. నియోజకవర్గంలో ఇప్పటి వరకూ 17 సబ్ స్టేషన్లు, 220 కేవీ సబ్‌స్టేషన్లు రెండు ఉన్నాయి. సబ్ స్టేషన్లలో సామర్థ్యం పెంచేందుకు 8 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్లు అధికంగా ఏర్పాటు చేయాల్సి ఉంది. ప్రతి సబ్‌స్టేషన్‌లో 8 ఎంవీఏల స్థానంలో మరొకటి, 5 ఎంవీఏ స్థానంలో మరో 8 ఎంవీఏ లేదా 5 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలి. ఇప్పటికే ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలో మెగా ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు గత ప్రభుత్వంలోనే ప్రతిపాదనలను సంబంధిత ట్రాన్స్‌కో అధికారులు ప్రభుత్వానికి పంపారు.

కోట్లాది రూపాయల ఆదాయం

జిల్లాలో ఉండి నియోజకవర్గంలో విద్యుత్ వినియోగం ద్వారా ప్రభుత్వానికి రూ.కోట్ల ఆదాయం లభిస్తుంది. ఆక్వా రంగంతో పాటు అనుబంధ పరిశ్రమలు, వ్యవసాయ అనుబంధ పరిశ్రమలకు విద్యుత్ వినియోగం అధికంగా ఉంది. నియోజకవర్గంలో గృహావసరాలు, గృహేతర అవసరాలు, ఆక్వా, వ్యవసాయ రంగాల్లో మొత్తం 1,07,000 వరకూ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ప్రస్తుత వినియోగంలో కొంత మేర సామర్థ్యం సరిపోతున్నా, వేసవిలోనూ, ఇతరత్రా సమయాల్లో విద్యుత్ సరఫరాలో నాణ్యమైన విద్యుత్ అందడంలేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అన్ని సబ్ స్టేషన్లలో 8 ఎంవీఏ మెగా పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను అమర్చాల్సి ఉంది. నియోజవర్గంలోని నాలుగు మండలాల్లో సరాసరిగా విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి.

మరో ఏడు సబ్‌స్టేషన్లు అవసరం

నియోజకవర్గంలోని విద్యుత్ వినియోగాన్ని బట్టి మరో ఏడు సబ్ స్టేషన్ల ఏర్పాటు అవసరం ఉంది. గత ప్రభుత్వంలో యండగండి, గొల్లలకోడేరు, గుమ్ములూరు, తాళ్లకోడులో కొత్త సబ్ స్టేషన్లు ఏర్పాటు చేయగా ప్రస్తుతం విద్యుత్ శాఖ అధికారుల నుంచి పెదకాపవరం, కోనలపల్లి, కొండేపూడితో పాటు మరో మూడు గ్రామాల్లో సబ్ స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపారు. ఏలూరుపాడులో సబ్‌స్టేషన్ మంజూరు చేయాల్సి ఉంది.



విద్యుత్ సబ్ స్టేషన్

నియోజకవర్గంలో	సబ్ స్టేషన్లు	కనెక్షన్లు	ప్రతిపాద నలు
ఆకివీడు	5	26,900	01
ఉండి	3	23,200	01
కాళ్ళ	5	28,400	01
పాలకోడేరు	4	28,500	04

ప్రతిపాదనలు పంపాం



ఏడీఈ పరిధిలో ఆకివీడు ఉంది. ఆకివీడు, కాళ్ల మండలాల్లో విద్యుత్ సబ్‌స్టేషన్లలో ఎనిమిది ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు పంపాం. సబ్‌స్టేషన్లలో సామర్థ్యం పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం. గతంలో కొన్ని మంజూరయ్యాయి. మరికొన్ని మంజూరు అవ్వాలి.

–యు.శ్రీనివాసరావు, ఆకివీడు

మార్కెట్ పాట వాయిదా

నరసాపురం: మున్సిపల్ మార్కెట్‌లో రోజువారీ పన్నుల వసూళ్లకు సంబంధించి సోమవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన బహిరంగ వేలంపాట వాయిదా పడింది. పాటదారులు ముందుకు రాకపోవడంతో పాటను ఈనెల 29కి వాయిదా వేస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ ఎం అంజయ్య తెలిపారు. రూ.72.82 లక్షలు ప్రారంభ ధరగా నిర్ణయించి పాటను ప్రారంభించారు. అయితే పాటదారులు పాటలో పాల్గొనడానికి ముందుకు రాకపోవడంతో వాయిదా వేశారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి

నరసాపురం: ప్రజలు తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందివ్వాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకట రమణ కోరారు. తడి, పొడి, ప్రమాదకర చెత్తను మూడు విభాగాలుగా విభజించి సేకరిస్తున్నట్టు చెప్పారు. ప్రజలు కూడా చెత్తను వేర్వేరుగా అందించి మున్సిపల్ సిబ్బందికి సహకరించాలని కోరారు. క్లీన్ పట్టణంగా తీర్చిదిద్దే ప్రక్రియలో భాగంగా పారిశుద్ధ్యంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. ఎండలు ఎక్కువగా ఉన్న దృష్ట్యా అవసరమైతే ట్యాంకర్ల ద్వారా మంచినీటి సరఫరా చేస్తామని చెప్పారు.

స్పీడ్ బ్రేకర్లు లేక ప్రమాదాలు

నరసాపురం: స్థానిక స్టీమర్ రోడ్డు జంక్షన్ వైఎస్ఆర్ సెంటర్ ప్రాంతం వాహనాలతో నిత్యం రద్దీగా ఉంటుంది. పట్టణానికి ఇదే ప్రధాన సెంటర్. ఇది అల్లూరి సత్యనారాయణరాజు మునిసిపల్ కాంప్లెక్స్‌కు ఎదురుగా ఉంది. దాదాపు వ్యాపారమంతా ఇక్కడే ఉంటుంది. ఈ ప్రాంతం నుంచే కూరగాయలు, చేపలు, కిరాణా మార్కెట్‌కు వెళ్లాలి. రద్దీగా ఉండే ఈ ప్రాంతం గుండా వాహనాలు మితిమీరిన వేగంతో వెళుతుండడంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఈ ప్రాంతంలో స్పీడు బ్రేకర్లు నిర్మించే పరిస్థితి కాస్త మెరుగవుతుందని పట్టణవాసులు కోరుతున్నారు.

26న భక్తిగీతాల ఆలాపన

పోడూరు: అన్నమాచార్యుల వర్ధంతి సందర్భంగా విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో పాలకొల్లు క్షీరా రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 26న సాయంత్రం నుంచి అన్నమాచార్యుల కీర్తనలు, భక్తి పాటల ఆలాపన నిర్వహించనున్నట్టు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి విశ్వ హిందూపరిషత్ జిల్లా అధ్యక్షుడు నల్ల ప్రసాద్, గాదె వెంకన్న, వివేకానంద కేంద్ర ఇన్‌చార్జి సదాశివ రావు తదితరులు హాజరుకానున్నారని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని కోరారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

భీమవరం: పట్టణంలోని మెంటేవారి తోటలో పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో ఈ నెల 25వ తేదిన చిన్న పిల్లలకు ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు అల్లూరి సీతారామరాజు, భగత్‌సింగ్ సేవా విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ చైర్మన్ బి.బలరాం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్యాంపులో ఉచితంగా 2డీ ఎకో టెస్ట్ నిర్వహించి రోగులను గుర్తించి, ఉచితంగా శస్త్ర చికిత్స అందిస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రౌడీ షీటర్ల బైండోవర్

భీమవరం: పట్టణానికి చెందిన ఐదుగురు రౌడీ షీటర్లను బైండోవర్ చేశామని టూటౌన్ సీఐ కాళీచరణ్ తెలిపారు. డి.శ్రీకాంత్, బి.నరేష్, జి.ఉదయ్‌కుమార్, టి.డేవిడ్, పి.శ్రీనివాస కిరణ్‌కుమార్‌ను అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకుండా ఆరు నెలలకోసారి బైండోవర్ చేస్తామన్నారు. వారిని తహసీల్దార్ ఎదుట హాజరు పర్చగా రూ.5 లక్షలు పూచీకత్తు తీసుకున్నారని తెలిపారు.

కంప్యూటర్ల బహూకరణ

భీమవరం (ప్రకాశంచౌక్): మావుళ్ళమ్మ దేవస్థానానికి భీమవరం స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా మెయిన్ బ్రాంచ్ రూ.1,20,000. విలువ చేసే రెండు కంప్యూటర్లను అందజేశారు. వీరికి ఆలయ అర్చకులు పూజలు నిర్వహించారు. బ్యాంకు రీజనల్ మేనేజర్ గురవయ్య, చీఫ్ మేనేజర్ శ్రీనివాస్‌రాజు, బ్యాంకు సిబ్బందికి ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మీనగేష్ శేష వస్త్రం, ప్రసాదాలు అందజేశారు.

కేవీకే శాస్త్రవేత్తకు డాక్టరేట్

ఉండి: ద్రాక్షలో నీటి ఎద్దడిని తట్టుకునే రకాలపై కేవీకే శాస్త్రవేత్త ఆర్ బిందుప్రవీణ భారతీయ వ్యవసాయ పరిశోధనా సంస్థ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. ఆదివారం న్యూఢిల్లీలో కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ ఆధ్వర్యంలో, వ్యవసాయశాఖ, రైతు సంక్షేమశాఖ సహాయ మంత్రులు భగీరథ చౌదరీ, రామనాథ్ ఠాగూర్ చేతుల మీదుగా డాక్టరేట్ పట్టా అందుకున్నట్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.